వెత్తలతడుకు భూములు పరిశీలిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, వ్యకాసం జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి జనార్ధన్

అడుగడుగునా..! రాహుకేతువులే..!

దోపిడీకి నిలయంగా ముక్కంటి క్షేత్రం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

దక్షిణ కాశీగా పేరు పొందిన శ్రీకాళహస్తి క్షేత్రంలో అడుగడుగునా భక్తులు దోపిడీకి గురవుతున్నారు. రాహు-కేతు సర్పదోష నివారణ పూజల్లో ఈ దోపిడీకి అడ్డే లేదు. దక్షిణ లేకుండా పూజలు చేయడానికి అర్చకులు ససేమిరా అంటున్న పరిస్థితి. సెల్ ఫోన్ కౌంటర్లలో అయితే దోపిడీకి అదుపే లేదు. పీఆర్వో కార్యాలయం నిండా దళారులే అనే ఆరోపణలు ఉన్నాయి. ఆలయ ఉద్యోగులే దళారుల అవతారమెత్తి భక్తులను నిలువు దోపిడీ చేస్తుండటం గమనార్హం.

అడుగడుగునా రాహు-కేతువులే..!

స్థానిక శ్రీకాళహస్తీశ్వరాలయం రాహు-కేతు సర్పదోష నివారణ పూజలకు ఖ్యాతి గాంచింది. ఈ పూజల కోసం దేశ, విదేశాలకు చెందిన భక్తులు నిత్యం వస్తుటారు. ఈ ఆలయంలో రూ.500, రూ.750, రూ.1,500, రూ.2,500, రూ.5వేలు... ఇలా ఐదు రకాల రాహు-కేతు పూజలు నిర్వహిస్తారు. ఇందులో సాదారణ భక్తులు ఎక్కువగా రూ.500 టికెట్టు పూజలు చేసుకుంటూ ఉంటారు. ఈ ఐదు రకాల పూజలు రోజుకు సగటున నాలుగు వేలకు తగ్గకుండా జరుగుతాయి. వారాంతాలు, అమావాస్య, పౌర్ణమి రోజుల్లో ఈ పూజల సంఖ్య బాగా పెరుగుతుంది. ఈ పూజలు చేసుకునే భక్తుల నుంచి ఎలాంటి దక్షిణ వసూలు చేయకూడదు. అయితే ఒక్కో రాహు-కేతు మండపంలో ఒక్కో ధర నిర్ణయించారు. రూ.101, రూ.201, రూ.501లు వంతున భక్తుల నుంచి దక్షిణ వసూలు చేస్తున్నారు. దక్షిణ ఇవ్వక పోతే దోషం పోదని ప్రచారం చేస్తారు. దీంతో రాహు-కేతు పూజలు చేసుకునే భక్తులు తమకు ఇష్టం లేకపోయినా పాప భీతితో దక్షిణ పెడుతున్నారు. గతంలో దక్షిణ ఇవ్వొద్దు అంటూ మండపాల్లో మైకుల ద్వారా ప్రచారం చేసేవారు. అయితే ఇటీవల కాలంలో ఈ విధానానికి స్వస్తి చెప్పారు. ఈ మండపాల్లో పని చేయడానికి కొందరు అర్చకులు రూ.లక్షలు ఖర్చు చేస్తున్నారు. అలా ఖర్చు చేస్తే తప్ప రాహు-కేతు మండపాల్లో అర్చకులకు విధులు అప్పగించడం లేదు. రాహు-కేతు మండపాల్లో నిత్యం రూ.లక్షల్లో అక్రమ వసూళ్లు జరుగుతున్నాయన్న ఆరోపణలు మిన్నంటుతున్నాయి.

సెల్ ఫోన్ కౌంటర్లలో భారీ మోసం

శ్రీకాళహస్తీశ్వరాలయంలోకి సెల్ ఫోన్లు, కెమెరాలు, లగేజీ బ్యాగులు అనుమతి లేదు. భక్తులు తీసుకువచ్చే వీటిని భద్రపరచడానికి ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఈ కౌంటర్ల నిర్వహణ బాధ్యతను టెండరు ద్వారా ఎమ్మెల్యే బొజ్జల వెంకటసుధీర్ రెడ్డికి ముఖ్య అనుచరులుగా ఉన్న వారు దక్కించుకున్నారు. టెండరు నిబంధన ప్రకారం ఒక్కో సెల్ ఫోనుకు రూ.5లు, కెమెరాకు రూ.10లు, లగేజీ బ్యాగుకు రూ.5లు వంతున వసూలు చేయాలి. అయితే టెండరు దారులు ఈ నిబంధన పాటించడం లేదు. ఒక్కో సెల్ ఫోనుకు రూ.10 నుంచి రూ.20వసూలు చేస్తున్నారు. కెమెరాలకు కూడా రూ.20లకు తగ్గకుండా వసూలు చేస్తున్నారు. లగేజీ బ్యాగుల విషయంలోనూ ఇదే తరహాలో అక్రమంగా వసూలు చేస్తున్నారు. టెండరు ధర కంటే నాలుగు రెట్లు అధికంగా వసూలు చేస్తున్నప్పటికీ ఆలయ అధికారులు పట్టించుకోవడం లేదు. శ్రీకాళహస్తీశ్వరస్వామి ఆలయానికి సగటున రోజుకు 15వేల భక్తులు తగ్గకుండా వస్తున్నారు. వారాంతాల్లో అయితే సగటున 25వేల మంది వస్తుంటారు. భక్తులు 90శాతానికి పైగా సెల్ ఫోన్లతో వస్తుంటారు. ఈ లెక్కన చూస్తే టెండరు దారులు రోజుకు రూ.1.50లక్షలకు పైగా భక్తుల నుంచి అదనంగా వసూలు చేస్తున్నారు. ఈ దోపిడీ గురించి ప్రజా ప్రతినిధులు, ఆలయ అధికారులకు అందరికీ తెలుసు. అయినా ఎవరూ పట్టించుకోరు. ఈ అక్రమ వసూళ్ల నుంచి అధికారులకూ వాటాలు వెళుతున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. ఈ కారణంగానే వారు పట్టించుకోవడం లేదనే విమర్శ ఉంది.

దళారులదే రాజ్యం

ముక్కంటి ఆలయంలో అడుగడుగునా దళారులు దర్శనమిస్తారు. ప్రముఖులకు స్వాగతం పలికి, దర్శనాలు చేయించడానికి పీఆర్వో కార్యాలయం ఏర్పాటు చేశారు. ఇక్కడ కేవలం ఆలయ ఉద్యోగులు మాత్రమే ఉండాలి. అయితే రాజకీయ పార్టీల నేతలు తమ అనుచరులకు ఈ కార్యాలయాన్ని కేంద్రంగా మార్చారు. వీరే ఇక్కడ చక్రం తిప్పుతుంటారు. ఎవరికైనా దర్శనం కావాలంటే రూ.500 నుంచి రూ.1,000 వరకు వీరు వసూలు చేస్తుంటారు. ఆలయ అధికారులు కూడా ఈ దళారులకు రెడ్ కార్పెట్ పరిచారు. పీఆర్వో కార్యాలయం నుంచి దళారులు దర్శనానికి వెళితే, అన్ని గేట్లు తెరిచేస్తారు. వీరి ఆద్వర్యంలోనే ఆశీర్వచనం కూడా ఇప్పిస్తారు. సామాన్య భక్తులు దర్శనానికి వెళితే... సవాలక్ష నిబంధనలు పెట్టే అధికారులు ఈ దళారుల విషయంలో ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ఇకనైనా ముక్కంటి ఆలయంలో జరిగే దోపిడీపై కూటమి ప్రభుత్వ పెద్దలు, దేవాదాయశాఖ అధికారులు దష్టి సారించాల్సి ఉంది.

శనివారపు ఇక్కట్లు తొలగేదెప్పుడు?

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

శ్రీకాళహస్తీశ్వరాలయానికి ప్రతి శనివారం వేల సంఖ్యలో భక్తులు వస్తుంటారు. వీరికి స్నానపు ఘట్టాలు, జలవినాయకుడి సమీపంలో నిర్మించిన స్నానపు గదుల్లో సరైన ఏర్పాట్లు చేయడం లేదని హిందూ ధార్మిక మండలి కన్వీనర్ గరికపాటి రమేష్ బాబు విమర్శించారు. స్నానపు గదుల్లో నీరు లేకపోవడంతో భక్తులు స్నానాలు ఆచరించేందుకు ఇక్కట్లు తప్పడం లేదని వాపోయారు. కాలకత్యాలకు అగచాట్లు తప్పడం లేదని మండిపడ్డారు. లక్షలు వెచ్చించిన స్నానపు గదులు, మరుగు దొడ్లు నీటి వసతి లేక నిరూపయోగంగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి భక్తులకు శనివారం ఇక్కట్లు తీర్చాలని కోరారు.

వెత్తలతడుకు దళితులకు పట్టాలివ్వాలి : సిపిఎం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్

నారాయణవనం మండలం వెత్తలతడుకు దళితులు గత 20 సంవత్సరాలుగా ప్రభుత్వ భూమి వంద ఎకరాలను వంద కుటుంబాలు సాగు చేసుకుంటున్నప్పటికీ రెవెన్యూ అధికారులు పట్టాలివ్వకపోవడం శోచనీయమని సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు డిమాండ్ చేశారు. శనివారం వెత్తలతడుకు భూపోరాట కేంద్రాన్ని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి జనార్ధన్, సిఐటియు పుత్తూరు నాయకులు ఆర్.వెంకటేష్, నారాయణవనం మండల కార్యదర్శి మునిశంకర్‌తో కలిసి సాగులో ఉన్న భూములను పరిశీలించారు. పెత్తందారులకు, దళితులకు కలిపి ఫారెస్టు సెటిల్మెంట్ అధికారి ఇచ్చిన ఆర్డర్‌ను కేవలం పెత్తందారులకు మాత్రమే అమలు చేసి, దళితులైన వెత్తలతడుకు వారికి అమలు చేయకపోవడం దారుణమన్నారు. గత ఐదు దశాబ్దాలుగా అటవీ అధికారులు దళితులపై కేసులు నమోదు చేస్తూ పైశాచిక ఆనందాన్ని పొందుతున్నారని మండిపడ్డారు. ఫారెస్టు సెటిల్మెంట్ ఆఫీసర్ ఇచ్చిన ఆర్డర్‌ను పక్కనే ఉన్న దాదాపు 200 ఎకరాల భూముల్లో పెత్తందారులకు మాత్రం అమలు చేసి, సాగుభూమి పట్టాలిచ్చారని అన్నారు. దళితులకు ఇవ్వకపోవడం ఏంటని ప్రశ్నించారు. దళితులపై కేసులు పెట్టి హైకోర్టు చుట్టూ తిప్పుతున్నారన్నారు. కలెక్టర్ స్పందించి దళితుల సాగులో ఉన్న అందరికీ పట్టాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే మరోసారి దళితులంతా కలిసి దశలవారీ పోరాటాలు, ఆందోళనలు తీవ్రతరం చేస్తారని హెచ్చరించారు.

దాసరి జనార్ధన్ మాట్లాడుతూ రాజ్యాంగంలో అందరూ సమానమైనప్పటికీ, చట్టాలు అమలు చేయడంలో వివక్ష చూపుతూనే ఉన్నారన్నారు. స్థానిక ఎంఎల్ఎ దళితుడైనప్పటికీ, ఇదే మండలవాసి అయినప్పటికీ వెత్తలతడుకు దళితులకు పట్టాలిప్పించడంలో నిర్లక్ష్యం చేస్తున్నారని విమర్శించారు. వెత్తలతడుకు గ్రామ మాజీ సర్పంచి సుబ్రమణ్యం, రాజేష్, వెత్తలతడుకు దళితులు పాల్గొన్నారు.

విద్యుత్ కాంట్రాక్టు కార్మికులకు జేఏసీ ద్రోహం : సిఐటియు

ప్రజాశక్తి - తిరుపతి సిటి

విద్యుత్ కాంట్రాక్టు కార్మికులకు జేఏసీ నాయకత్వం ద్రోహం చేసిందని, రాష్ట్ర ప్రభుత్వం బాధ్యతా రాహిత్యంగా వ్యవహరించి వేలాది మంది కార్మికుల కుటుంబాల్లో మానసిక క్షోభకు కారణమైందని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి ఓ ప్రకటనలో తీవ్రంగా విమర్శించారు. శుక్రవారం విద్యుత్ జేఏసీ రాష్ట్ర ప్రభుత్వంతో జరిపిన చర్చలు ప్రహసనంలా మారాయని, కాంట్రాక్టు కార్మికులను అడ్డంపెట్టుకుని కొందరు జేఏసీ పెద్దలు లాభాలు పొందారని ఆరోపించారు. తెలంగాణ తరహాలో కాంట్రాక్ట్ కార్మికులను విద్యుత్ సంస్థలో విలీనం చేసుకోవాలని జేఏసీ పెట్టిన డిమాండ్ ను రాష్ట్ర ప్రభుత్వం కనీసం పరిగణలో తీసుకోలేదని... వేలాదిమంది కాంట్రాక్టు కార్మికుల సమస్యలను, వారి వెనుక ఉన్న కుటుంబ సభ్యుల మనోవేదనను పట్టించుకోలేదని... తమ పరిధిలో లేదని తప్పించుకోవడానికి ప్రయత్నించారని... విద్యుత్ జేఏసీ నేతలు కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు పట్టుదలతో వ్యవహరించి ... సమ్మెను కొనసాగించకుండా లొంగుబాటును ప్రదర్శించడం దారుణమని అన్నారు. జేఏసీ చేసుకున్న ఒప్పందాలకు కాంట్రాక్ట్ కార్మికులు వ్యతిరేకమని, ఒప్పంద ప్రతులను రాష్ట్రవ్యాప్తంగా దగ్ధం చేస్తారని తెలిపారు. జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ హయాంలోనూ, చంద్రబాబు ప్రభుత్వ హయాంలోనూ కార్పొరేట్ కంపెనీలకు, షిరిడి సాయి కంపెనీకి పనులు అవుతున్నట్టుగా కాంట్రాక్ట్ కార్మికుల పనులు ఎందుకు కావని సూటిగా ప్రశ్నించారు. కాంట్రాక్టు కార్మికులు కుంగిపోకుండా మరో పోరాటానికి సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు.

సాయిలక్ష్మి, ఈశ్వరిలకు ఐద్వా రాష్ట్ర కమిటీలో చోటు

ప్రజాశక్తి - రేణిగుంట

అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం 16వ రాష్ట్ర మహాసభలు అక్టోబర్ 13, 14, 15 తేదీల్లో అనంతపురంలో జరిగాయి. రాష్ట్ర మహాసభల్లో 57 మందితో రాష్ట్ర కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అందులో తిరుపతి జిల్లాకు చెందిన డాక్టర్ పి. సాయి లక్ష్మీ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా, రాష్ట్ర కమిటీ సభ్యురాలుగా కొండ్రెడ్డి. ఈశ్వరిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర కమిటీలోకి తిరుపతి జిల్లా నుండి ఇద్దరు మహిళలకు చోటు దక్కడం ఇదే మొదటిసారి. ఈ మహాసభలలో మహిళలపై జరిగే లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా అన్ని ప్రభుత్వ- ప్రైవేటు సంస్థలలోనూ "లైంగిక వేధింపుల నిరోధక కమిటీ" లను ఏర్పాటు చేయాలని, వాటి ఏర్పాటు కోసం ఐద్వా కషి చేయాలని ఈ రాష్ట్ర మహాసభలు సందర్భంగా తీర్మానం చేశారని సాయిలక్ష్మి, ఈశ్వరి పేర్కొన్నారు.

జాయింట్ కలెక్టర్‌గా ఎన్.మౌర్యకు ఉద్యోగోన్నతి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా ఉన్న నారపరెడ్డి మౌర్యను జిల్లా జాయింట్ కలెక్టర్‌గా నియమిస్తూ రాష్ట్ర ప్రిన్సిపల్ కార్యదర్శి విజయ్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ జిల్లా జాయింట్ కలెక్టర్‌గా పని చేసిన శుభం బన్సల్ పరిశ్రమల శాఖ డైరెక్టర్ గా బదిలీ అయ్యారు. జెసి పోస్ట్‌లో ఎవరినీ నియమించలేదు. ఈ నేపథ్యంలో 2018 ఐఎఎస్ బ్యాచ్ నారప్ప రెడ్డి మౌర్య కు జిల్లా జాయింట్ కలెక్టర్గా నియమితులయ్యారు. తిరుపతి కార్పొరేషన్ కమిషనర్‌గా మౌర్య 15 నెలలుగా ఉన్నారు. స్వచ్ఛ కార్పొరేషన్, స్వచ్ఛ సూపర్ లీగ్ అవార్డులను రాష్ట్రపతి ద్రౌపదీముర్ము చేతుల మీద ఇటీవల తీసుకున్న విషయం తెలిసిందే. నారప్పరెడ్డి మౌర్య జిల్లా జాయింట్ కలెక్టర్‌గా నియమించడమే కాకుండా, తిరుపతి అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ వైస్ చైర్మన్‌గానూ వ్యవహరించనున్నారు.

'సూర్యఘర్'తో విద్యుత్ స్వావలంబన సాధ్యం : ఎంఎల్ఎ

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

ప్రధానమంత్రి సూర్యఘర్ పథకం ద్వారా ప్రతి ఇంటికీ విద్యుత్ స్వావలంబన సాధ్యమని తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తెలిపారు. ఈ పథకాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. శనివారం స్థానిక ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, "ఒక సంవత్సరంలో 50 శాతానికి కనెక్షన్లు పూర్తి చేసేలా కషి చేయాలి" అని సూచించారు. ఈ సందర్భంగా ఆయన ఎస్ఈ చంద్రశేఖరరావును మార్గదర్శకాలు అందజేశారు. ప్రతి ఇంటి పైకప్పుపై సౌర ప్యానెల్లు ఏర్పాటు చేస్తే విద్యుత్ బిల్లులు తగ్గటమే కాకుండా పర్యావరణ పరిరక్షణకు దోహదం అవుతుందని చెప్పారు. ప్రజలలో అవగాహన పెంచేలా విస్తత ప్రచారం చేయాలని అధికారులు, ప్రజాప్రతినిధులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఈఈ గంగాధర్ రెడ్డి, డిఈ. వాసవి లత, ఈఈ.బాలాజీ, వెండర్స్ అసోసియేషన్ సెక్రటరీ మణిగండన్ పాల్గొన్నారు.

ఫలించిన తుడా చైర్మన్ కృషి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

తిరుపతి పట్టణ అభివృద్ధి సంస్థ చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి ఇటీవల ఢిల్లీలో జరిగిన సమ్మిట్ లో పాల్గొని, అక్కడ వివిధ జాతీయ స్థాయి కంపెనీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా బిఎల్‌యుఎస్ఎఎల్‌జెడ్‌జెడ్ హోటల్ మేనేజ్మెంట్ ప్రతినిధులకు తుడా టవర్స్ లో జరుగుతున్న పనులను వివరించి, పెట్టుబడులకు సరైన ప్రదేశం అని తెలియజేశారు. తుడా టవర్స్ ప్రాజెక్ట్ తిరుపతి అభివృద్ధిలో ముఖ్యమైన పాత్ర పోషించనుందని, ఆధునిక వసతులతో కూడిన స్మార్ట్ బిల్డింగ్‌గా రూపుదిద్దేందుకు పనులను చేపడుతున్నామని డాలర్స్ దివాకర్ రెడ్డి తెలిపారు. సానుకూలంగా స్పందించిన ఆ సంస్థ ప్రతినిధులు శనివారం తిరుపతికి విచ్చేసి తుడా టవర్స్ ను పరిశీలించారు. అనంతరం తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డితోను, ఇతర అధికారులతోనూ సమావేశమై చర్చించారు. అభివృద్ధి చెందుతున్న తిరుపతి నగరంలో తమ సంస్థను పెట్టుబడులకు ఆహ్వానించడం చాలా సంతోషంగా ఉందని, తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో తుడా కార్యదర్శి శ్రీకాంత్ పాల్గొన్నారు.

జెవివి చెకుముకి సైన్స్ సంబరాలు

టాలెంట్ టెస్ట్ రాసిన 20వేల మంది విద్యార్థులు

ప్రజాశక్తి - తిరుపతి సిటి, తడ

జనవిజ్ఞాన వేదిక (జేవివి) ఆధ్వర్యంలో చెకుముకి సైన్స్ సంబరాల్లో భాగంగా జిల్లావ్యాప్తంగా నిర్వహించిన టాలెంట్ టెస్టును 20వేల మంది విద్యార్థులు రాసినట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకర రెడ్డెప్ప తెలిపారు. చెకుముకి సైన్స్ సంబరాలు గత 35 సంవత్సరాలుగా పాఠశాల, మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ ఏడాది శనివారం అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో నిర్వహించారు. తిరుపతి నగరంలో 50 పాఠశాలల నుంచి ఐదువేల మంది 8, 9, 10 తరగతుల విద్యార్థులు పాల్గొన్నారు. పాఠశాల స్థాయిలో ప్రతిభ కనబరచిన వారికి నవంబర్ 1న మండలస్థాయిలో జరుగుతుంది. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు బిర్లానాయుడు, రఫీ, చెంగయ్య, రామమూర్తి, రమణ, కోదండపాణి, జయచంద్ర, చెంచయ్య, నాగరాజ, కుమార్, కుప్పస్వామి, రాజేంద్ర పాల్గొన్నారు.

తడలో కాశింగాడు కుప్పంలో చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ప్రతిభచూపిన వారికి నవంబర్ 1న సూళ్లూరుపేట బాలికల ఉన్నత పాఠశాలలో మండలస్థాయి పరీక్ష ఉంటుందని జేవివి అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు రాజేష్‌బాబు, రామ్మూర్తి తెలిపారు. కాశింగాడు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, తడ మండల విద్యాశాఖ అధికారులు వేములు, మల్లికార్జునరావు పోస్టర్ ఆవిష్కరించి టాలెంట్ టెస్ట్ పరీక్షను ప్రారంభించారు. సూళ్లూరుపేట, తడ, దొరవారిసత్రం మండలాల్లో 54 పాఠశాలల నుంచి 3,100 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో విద్యార్థులకు సైన్స్ టాలెంట్ టెస్ట్

టీటీడీ ముద్రణాలయంలో ఘనంగా ఆయుధ పూజ

ప్రజాశక్తి - తిరుపతి సిటి

తిరుపతిలోని టీటీడీ పరిపాలనా భవనం ఎదురుగా గల ముద్రణాలయంలో శనివారం ఆయుధపూజ ఘనంగా జరిగింది. శ్రీవారి విగ్రహానికి పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. ముద్రణాలయాన్ని అందంగా అలంకరించి అర్చకులు వేదమంత్రాలు పఠిస్తూ యంత్రాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇక్కడ గల డిటిపి, ఆఫ్‌సెట్, మిషన్ సెక్షన్, ఆర్టిస్టు, బైండింగ్ విభాగాల్లోని యంత్రాలకు ఆయుధపూజ చేశారు. జెఈవో వి. వీరబ్రహ్మం, ముద్రణాలయం డెప్యూటీ ఈవో విజయ్‌కుమార్, పిఆర్‌వో(ఎఫ్ఏసి) కుమారి నీలిమ, యూనియన్ నాయకులు ఎన్. శ్రీనివాసన్, వి.కె.శ్రీనివాసులు, శ్రీనివాసమూర్తి పాల్గొన్నారు.

స్విమ్స్‌లోని రవాణా విభాగంలో శనివారం ఆయుధపూజ జరిగింది. సంచాలకులు ఆర్‌వి కుమార్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. పింక్ బస్సులు, బ్యాటరీ వాహనాలు, అంబులెన్స్‌లు, ఇతర వాహనాలను పుష్పాలతో అలంకరించి ఆయుధపూజ చేపట్టారు. ఈ కార్యక్రమంలో స్విమ్స్ డీన్ డాక్టర్ అలోక్ సచన్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్, ఆర్ఎంవో డాక్టర్ కోటిరెడ్డి, డెప్యూటీ ఈఈ పార్థసారథి పాల్గొన్నారు.

స్వచ్ఛదీపావళి..గ్రీన్ దీపావళి : కలెక్టర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

'స్వచ్ఛ దీపావళి..గ్రీన్ దీపావళి' లక్ష్యంగా పర్యావరణాన్ని కాపాడుకునేలా పండుగ జరుపుకోవాలని కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ హితవు పలికారు. 'స్వచ్ఛఆంధ్ర..స్వర్ణఆంధ్ర'లో భాగంగా ఎంఎల్ఎ ఆరణి శ్రీనివాసులు, కమిషనర్ ఎన్.మౌర్య, ప్రజాప్రతినిధులతోకలిసి కలెక్టర్ పాల్గొన్నారు. మంచి వాతావరణం కోసం ప్రతి ఒక్కరూ విరివిగా మొక్కలను నాటాలని పిలుపునిచ్చారు. అందరితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ నెలలో 'స్వచ్ఛమైన గాలి.. కాలుష్య రహితనగరం' థీమ్‌తో ప్రారంభమవుతుందన్నారు. దీపావళి పండుగకు టపాసుల వల్ల కలిగే గాలి కాలుష్యాన్ని తగ్గించడమే ప్రధాన లక్ష్యమన్నారు. ప్రతి వార్డులో క్రాకర్ పొల్యూషన్ తగ్గించేలా ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. అనంతరం నెహ్రూ మైదానంలో ఏర్పాటు చేసిన టపాసుల దుకాణాలను పరిశీలించి సలహాలు, సూచనలు ఇచ్చారు.రాష్ట్ర గ్రీనరీ అండ్ బ్యూటిఫికేషన్ చైర్మన్ సుగుణ, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, డిప్యూటీ మేయర్లు ముద్ర నారాయణ, ఆర్. సి. మునికృష్ణ పాల్గొన్నారు.

పర్యావరణ హితంగా దీపావళి జరుపుకోవాలంటూ కలెక్టర్ సూచన

కార్మికులకు పోరాటాలే శరణ్యం..!

ప్రజా'దృష్టి'

ప్రజాశక్తి-తిరుపతి సిటి

దేశభక్తి ఇసుమంతైనా లేని మతఛాందస వాదులు రాజ్యమేలుతున్న ప్రస్తుత తరుణంలో కార్మికులకు కష్టాలు తప్పడం లేదు. కార్పొరేట్ శక్తులకు దాసోహం అంటున్న ప్రస్తుత పాలకుల తీరువల్ల కార్మికులు నిత్యం సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నారు. సంపన్నుల కబంధహస్తాల నుంచి కాస్తైనా ఊపిరిపీల్చుకుని తమ జీవన ప్రయాణాన్ని సాగించాలంటే కార్మికులకు పోరాటాలే శరణ్యం అయ్యాయి. కార్మికుల కన్నీటిని తుడుస్తూ, వారి కష్టానికి తగిన ప్రతిఫలం కోరుతూ అనునిత్యం వారికి అండగా ఉంటూ ముందుండి పోరాటాలను సాగిస్తోంది సిఐటియు. అనేక పోరాటాల విజయస్ఫూర్తితో నూతన నాయకత్వంలో ముందుకెళ్లేందుకు, నూతనోత్సాహాన్ని కార్మికవర్గానికి అందించింది, ఇటీవల జరిగిన సిఐటియు జిల్లా మహాసభలు అనడంలో అతిశయోక్తిలేదు.

ఇంచుమించు పుష్కర కాలంగా కేంద్రంలో అధికారాన్ని అనుభవిస్తున్న వ్యక్తులు మతతత్వంతో పెట్రేగుతూ, ప్రజలమధ్య మత, కుల, ప్రాంతాల విద్వేషాలు రెచ్చగొడుతూ, తాము కార్పొరేట్ శక్తుల పాదదాసులము అనే నిజాన్ని ప్రజల ఆలోచనలోనికి రానీయకుండా అలజడులు సృష్టించడమే ధ్యేయంగా వ్యవహరిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని బూర్జువ రాజకీయ పార్టీలు వారికి వత్తాసు పలుకుతూ పెత్తనం కోసం పైచేయి సాధించేందుకు పాకులాడుతున్నాయే తప్పా, ప్రజల ఇబ్బందులు, కార్మికుల కష్టసుఖాలు ఏమాత్రం పట్టంచుకోవడం లేదు. అందుకు అధికారంలో ఉన్న కూటమి పార్టీలు కానీ, ప్రతిపక్షంలో ఉన్న ప్రధాన పార్టీకాని దొందు దొందే అన్న రీతిలో వ్యవహరిస్తున్నాయి. కేంద్రంలోని పాలకులు ఎద్దు ఈనింది అంటే గాటున కట్టేయి అనే చందాలో రాష్ట్ర పాలకులు వ్యవహరిస్తుండడం గమనార్హం. ప్రభుత్వ సంస్థలన్నిటిని ప్రయివేట్ వ్యక్తులకు గంపగుత్తగా అప్పగించేందుకు, ఆయా సంస్థలను ఉద్దేశపూర్వకంగా నిర్వీర్యం చేసేందుకు పూనుకుంటున్నాయి. పాలకుల నిర్ణయాలన్ని ఒకరిద్దరు కార్పొరేట్ వ్యక్తులకు మేలు చేకూర్చుతాయే తప్ప, ప్రజలకు రవ్వంతైన మేలు చేకూర్చదనేది జగమెరిగిన సత్యం. అలాంటి కోవకు చెందినదే ఇటీవల కేంద్రం పార్లమెంట్ సాక్షిగా తీసుకొచ్చిన 12 గంటల పనివిధానం. కార్మిక సంఘాలు ప్రపంచ వ్యాప్తంగా శతాబ్దాల తరబడి పోరాటాలు జరిపి, ప్రాణత్యాగాలు చేసి తీసుకొచ్చిన 8 గంటల పని విధానానికి స్వస్తిపలికి 12 గంటల పనివిధానాన్ని ప్రవేశపెట్టారు. ఒత్తిడితో కూడుకున్న పోటీ ప్రపంచాన్ని తట్టుకోవాలంటే ఉన్న పనిగంటలను మరింత తగ్గించాల్సింది పోయి ఏకంగా రెండు రెట్లు పెంచేలా నిర్ణయం తీసుకోవడం ఉన్మాద చర్యే. కేంద్రాన్ని ప్రశ్నించాల్సిన రాష్ట్ర పాలకులు మరో అడుగు ముందుకేసి రోజుకు 12 గంటల కాదు, 13 గంటలు పని చేయాలనేలా, ఏకంగా అసెంబ్లీలోనే బిల్లు ప్రవేశపెట్టి, ఆమోదించి, దేశంలోనే మొదటిరాష్ట్రంగా నిలిచి, కేంద్ర పాలకులకు తామే అత్యంత విధేయులమనేలా వ్యవహరించడం దారుణం. ఇలాంటి తరుణంలో కార్మికుల సమస్యల పరిష్కారానికి పోరాటాలే శరణ్యం. ఈ నేపథ్యంలో కార్మికులకు అండగా ఉన్న సిఐటియు మరింత ఉత్సాహంతో ముందుకెళ్లేందుకు, అనువవజ్ఞులైన పెద్దలు, ఉడుకు రక్తంతో ఉరకలు వేసే యువత అధిక సంఖ్యలో మిలితమైన జిల్లా నూతన కార్యవర్గాన్ని సిద్ధం చేశారు. అందుకు ఈ నెల 13, 14 తేదీలో పుత్తూరు కేంద్రంగా జరిగిన సిఐటియు తిరుపతి జిల్లా మహాసభలు వేదికయ్యాయి. రెండు రోజులు పాటు జరిగిన ఈ మహాసభలో ప్రస్తుత తరుణంలో వివిధ రంగాల్లో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి, గతం, వర్తమానం, భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఉద్యమస్ఫూర్తితో పోరుబాట పట్టేందుకు అందుకు కార్మికులను కార్యోన్ముకులను చేసేందుకు కొత్త నాయకత్వం సిద్ధమైంది.

కృష్ణయ్య మృతికి నివాళి

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : రూరల్ మండలం, కేబీఆర్ పురం గ్రామానికి చెందిన టిడిపి నాయకులు కృష్ణయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న నగరి నియోజకవర్గ శాసనసభ్యులు గాలి భాను ప్రకాష్ కేబీఆర్ పురం గ్రామానికి.వెళ్లి ఆయనకు నివాళులర్పించారు. అనంతరం రామసముద్రం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ టిడిపి నాయకులు శాఖమూరి సుబ్రహ్మణ్యం నాయుడు మృతికి నివాళులర్పించారు. ఆయన వెంట, రూరల్ పార్టీ అధ్యక్షుడు, అరవ బాలాజీ ప్రధాన కార్యదర్శి వెంకటేష్, పరమేశ్వర మంగళం సింగల్ విండో అధ్యక్షుడు మోహన్ రాజు తదితరులున్నారు.

సచివాలయం తనిఖీ

ప్రజాశక్తి - వాకాడు:వాకాడు మండలం ఎంపీడీవో సాయిప్రసాద్ శనివారం దుగరాజపట్నం సచివాలయాన్ని తనిఖీ చేశారు. సచివాలయంలోని పలు రిజిస్టర్లను పరిశీలించారు. ఎనర్జీ అసిస్టెంట్ విధులకు సరిగ్గా హాజరుకానందువల్ల షోకాజ్ నోటీసు ఇవ్వాల్సిందిగా పంచాయతీ కార్యదర్శి సిహెచ్ సురేష్ బాబుని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పోలీస్ స్టేషన్ తనిఖీ

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: బుచ్చినాయుడు కండ్రిగ పోలీస్ స్టేషన్‌ను సర్కిల్ ఇన్స్పెక్టర్ తిమ్మయ్య శనివారం ఆకస్మిక తనిఖీ చేశారు. కేసులు వివరాలను, సిబ్బంది కొరతను వివిధ రకాలైన విషయాలను తెలుసుకున్నారు. కేసుల పురోగతిపై ఆరా తీశారు. అనంతరం ట్రాఫిక్ సమస్యలు, ప్రజా సమస్యలను పరిష్కరించే దిశగా పనిచేయవాలని తెలిపారు. దీపావళి సందర్భంగా అప్రమత్తంగా విధులు నిర్వహించాలని సూచించారు.

సహజ వ్యవసాయంపై శిక్షణ

ప్రజాశక్తి - బుచ్చి నాయుడు కండ్రిగ: ప్రజా ప్రగతి ట్రస్ట్ వారి ఆధ్వర్యంలో బిఎన్ కండ్రిగ మండలంలోని పల్లమాల పంచాయితీ, పివి కండ్రిగ పంచాయతీలలోని ఏడు గ్రామాల్లో సహజ వ్యవసాయం చేయుటకు ఎన్నిక కాబడిన 40 మంది రైతులకు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో ప్రజా ప్రగతి ట్రస్ట్ చైర్మన్ శ్రీనివాసులు మాట్లాడుతూ సహజ వ్యవసాయం ప్రాధాన్యతను వివరించారు. ఈ కార్యక్రమానికి 40 మంది రైతులు హాజరయ్యారు. ప్రజా ప్రగతి ట్రస్ట్ నుండి దేవేంద్ర, ఓంకార్, రాఘవయ్య, ఈశ్వరయ్య, టీవీ వేణుగోపాల్ పాల్గొన్నారు.

గూడూరు రూరల్ ఎస్సైగా తిరుపతయ్య

ప్రజాశక్తి - గూడూరు టౌన్ :గూడూరు రూరల్ ఎస్ఐ గా తిరుపతయ్య శనివారం బాధ్యతలు చేపట్టారు. ఈయన గతంలో గూడూరు ఒకటవ పట్టణ, రెండో పట్టణ ఎస్ఐగా పనిచేశారు. ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న రూరల్ ఎస్ఐ మనోజ్ కుమార్ ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్‌కి బదిలీ అయ్యారు.

కేన్సర్‌పై అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ :గూడూరు, డి.ఆర్.డబ్ల్యూ కాలేజీలో శనివారం రోటరీ వెస్ట్ క్లబ్, గూడూరు ఆధ్వర్యంలో నెల్లూరు కిమ్స్ హాస్పిటల్ సహకారంతో శనివారం క్యాన్సర్‌పై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు విజయ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ రోటరీ వెస్ట్ క్లబ్ విద్య, వైద్యం పైన ఎక్కువ కార్యక్రమాలు చేస్తుంటామని, అందులో భాగంగా క్యాన్సర్ అవగాహనా కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ రాఘవ రెడ్డి, ఎల్లసిరి గోపాల్ రెడ్డి, సీనియర్ ఆడిటర్ రామ్ మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 55 మందికి సీఎం సహాయ నిధి నుండి మంజూరైన చెక్కులను శనివారం లబ్ధిదారులకు ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 75 మందికి 35 లక్షల 97 వేల, 820 రూపాయలు చెక్కులను లబ్ధిదారులకు అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కిరణ్ కుమార్ భాస్కర్ రెడ్డి, పులిమి శ్రీనివాసులు, వెంకటేశ్వరరాజు తదితరులు పాల్గొన్నారు.

యూరియా కార్డులు పంపిణీ

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వ్యవసాయ శాఖ అధికారుల ఆధ్వర్యంలో శనివారం రైతులకు యూరియా పంపిణీ కార్డులను ఎమ్మెల్యే సునీల్ కుమార్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ ఏడి మాట్లాడుతూ యూరియా నిల్వ ఉందని, రైతులు ఆందోళన చెందొద్దని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కిరణ్ కుమార్, శ్రీనివాసులు, వెంకటేశ్వరరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన హరి ప్రసాద్

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: బుచ్చినాయుడు కండ్రిగ మండలం నూతన ఎస్ఐగా హరి ప్రసాద్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో పనిచేస్తున్న విశ్వనాథ నాయుడు పదవీ విరమణ పొందడంతో, సత్యవేడు మండలం శ్రీ సిటీలో సబ్ ఇన్స్పెక్టర్‌గా పనిచేస్తూ బుచ్చినాయుడు కండ్రిగ పోలీస్ స్టేషన్‌కు బదిలీపై వచ్చారు. ఆయన మాట్లాడుతూ మండల పరిధిలో అవాంఛనీయ ఘటనలపై చర్యలు తీసుకుంటామన్నారు.

విశ్వం విద్యార్థులు విజయకేతనం

ప్రజాశక్తి - క్యాంపస్ : 2025 సైనిక్ స్కూల్ ఫలితాల్లో రాష్ట్రస్థాయి ప్రథమ ర్యాంకుతో పాటు 67 సీట్లు సాధించి, విశ్వం విద్యార్థులు మరోసారి తమ ప్రతిభను చాటుకున్నారు. 2025 నవోదయ ఫలితాల్లోనూ 69 సీట్లతో విశ్వం విద్యార్థులు ఘనవిజయం సాధించారు. విశ్వం విద్యా సంస్థల అధినేత, కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షులు డా. ఎన్. విశ్వనాథ్ రెడ్డి మాట్లాడుతూ 2025 ఆల్ ఇండియా సైనిక్ స్కూల్ ఎంట్రన్స్ టెస్ట్ ఫలితాల్లో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంకులు సాధించడం విశ్వం విద్యార్థుల ప్రతిభకు నిదర్శనమన్నారు. 2026-2027 విద్యా సంవత్సరానికి సంబంధించి సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్ష దరఖాస్తుల చివరి తేదీ అక్టోబర్ 30, 2025 అని తెలిపారు. వివరాలకు: 8688888802 / 9399976999 ను సంప్రదించవచ్చని తెలిపారు.

దుర్గాప్రసాద్‌కు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

సిఐటియు జిల్లా అధ్యక్షుడు యస్.జయచంద్ర

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: టిటిడిలో ప్రెస్ విభాగానికి సంబంధించిన బిల్డింగ్‌లో లిఫ్ట్ విప్పుతుండగా విద్యుత్ తీగలు తగిలి కార్మికుడు దుర్గాప్రసాద్(35) చనిపోవడం జరిగింది. మృతుడి భార్య దుర్గ, తల్లిదండ్రులు, బంధువులు రుయా మార్చురీ వద్ద ఆందోళన దిగారు. వారి ఆందోళనకు సిఐటియు జిల్లా అధ్యక్షుడు యస్.జయచంద్ర, జిల్లా కార్యదర్శులు గండికోట నాగ వెంకటేష్, బుజ్జి మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధ్యక్షుడు యస్. జయచంద్ర మాట్లాడుతూ లిఫ్ట్ కాంట్రాక్టర్ కాంట్రాక్టర్ శ్రీనివాసరెడ్డి సరైన భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం కారణంగానే చనిపోవడం జరిగిందన్నారు. ఉదయం చనిపోతే ఇప్పటివరకు కాంట్రాక్టర్ కనీసం హాస్పిటల్‌కు వచ్చి పరామర్శించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్ చాలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాడన్నారు. ఈరోజు వర్షం పడుతుందని కార్మికులు చెప్పినప్పటికీ పని అయిపోవాలని పిలిపించారన్నారు. అక్కడ ఎలాంటి భద్రతా ప్రమాణాలు పాటించకపోవడంతో కార్మికుడు మృతి చెందాడని మండిపడ్డారు. సదరు కాంట్రాక్టర్‌పై క్రిమినల్ చర్యలు తీసుకొని, తక్షణమే అరెస్ట్ చేయాలని, బాధితుడి కుటుంబానికి 50 లక్షల రూపాయలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

వర్షమొస్తే.. వరద, ఎండ కాస్తే దుమ్ము

వానలతో చెరువుల్లా రోడ్లు.. పట్టించుకునే నాథుడేడీ..? : సిపిఎం

ప్రజాశక్తి - నాయుడుపేట:నాయుడుపేట పట్టణ రోడ్లపై నది ప్రవహిస్తుందని ప్రజలు చలోక్తులు విసురుతున్నారు. శనివారం నాయుడుపేట పట్టణంలో కురిసిన కొద్దిపాటి వర్షానికి పట్టణ రోడ్లన్నీ జలమయమై చెరువులను తలపిస్తున్నాయి. గత కొన్ని సంవత్సరాలుగా నాయుడుపేట మున్సిపాలిటీ పరిధిలో రోడ్లు మరమ్మతులకు నోచుకోక పట్టణంలో ఎక్కడపడితే అక్కడ గుంటలు పడి నాలుగు చినుకులు పడితే గుంటలన్ని నిండిపోతున్నాయి. ప్రజలు బయటకు రాలేని పరిస్థితులు ఏర్పడుతున్నాయి. వాహన చోదకుల పరిస్థితి మరింత విషమంగా మారుతుంది. రోడ్లన్నీ నీళ్లతో నిండిపోయి గుంటలు ఎక్కడున్నాయో అర్థం కాక వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. శనివారం మధ్యాహ్నం కురిసిన వర్షానికి అగ్రహార పేటలో నీళ్లు నిండిపోయి స్కూలు పిల్లలు నడుముల్లోతు నీళ్ళల్లో అవస్థలు పడుతూనే ఇళ్లకు చేరుకున్నారు. పట్టణంలోని పిచ్చిరెడ్డి తోపు, పాత శ్రీకాళహస్తి రోడ్డు పరిస్థితి మరింత దుర్భరంగా మారింది. చెన్నై, తిరుపతి, విజయవాడ, నెల్లూరుల నుంచి మేనకూరు సెజ్‌లకు తిరిగే భారీ వాహనాలకు, కంపెనీ బస్సులకు, పట్టణ ప్రజలు తిరిగేందుకు ఈ దారిని ఉపయోగించవలసి ఉంటుంది. భారీ వాహనాల కారణంగా అక్కడక్కడ గుంటలు పడి రెండు నెలల ముందు వరకు కొంత ఇబ్బంది పడుతూ తిరుగుతున్న ప్రజలకు ఇప్పుడా దారిని ఉపయోగించలేని పరిస్థితులను నెలకొన్నాయి. ప్రజలకు ఏదో మేలు చేసే పేరుతో ఆర్ అండ్ బి పరిధిలోకి వచ్చే ఈ రోడ్డును మునిసిపాలిటీ వారు 10 లక్షలతో మెరుగుపరిచేందుకు పూనుకొని ఈ రోడ్డుకు మరమ్మతులు నిర్వహించారు. ఈ రోడ్డులో పడ్డ గుంటలు పూడ్చేందుకు కొన్ని లోడ్లు కంకర పొడిని తీసుకొచ్చి పోశారు. అప్పటివరకు ఏదో కొంచెం ఇబ్బంది పడుతూ తిరుగుతున్న ప్రజలకు పెనం పైనుంచి పొయ్యిలో పడ్డట్టయింది. సదరు కాంట్రాక్టర్ నిర్వహంతో ఆ రోడ్డుకు చుట్టుపక్కల ఉన్న ప్రజలు, ఆ రోడ్డున ఉపయోగించే ద్విచక్ర వాహన చోదకుల బాధలు వర్ణనాతీతంగా మారాయి. ఎండ కాస్తే దుమ్ము దూళితో నిండ పోతూ, వర్షం పడితే బురద బీభత్సాన్ని సృష్టిస్తూ ప్రజలు ఎవరు ఆ చుట్టుపక్కల ఉండలేని తిరగలేని పరిస్థితులు నెలకొన్నాయి. అభివృద్ధి నెపంతో నాయకులు దోచుకోవడం, అధికారులు వారిని ప్రశ్నించకుండా వారి దయ దక్షిణ్యాల కోసం వారు చేస్తున్న పనులకు అండగా నిలవడంతో ప్రజలు అటు నాయకులని, ఇటు అధికారులను ప్రశ్నించే ధైర్యం చేయలేక వారి బాధలు ఎవరికి చెప్పుకోలేక సర్దుకుని ఆ రోడ్డులను ఉపయోగించుకోలేక మా బ్రతుకులు ఈ దుమ్ము ధూళి, బురదలోనే ఉండిపోవాలా అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నాయుడుపేట సిపిఎం నాయకులు శివకవి ముకుంద స్పందిస్తూ.. నాయుడుపేట పట్టణాన్ని అధికారులు, నాయకులు సమానంగా పంచుకుని తింటూ, ప్రజలను పురుగుల కంటే హీనంగా చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్టర్లకు, కార్పొరేటర్లకు పట్టణాన్ని దారదత్తం చేసి వారు సృష్టిస్తున్న వికృతాలను చూసి వినోదిస్తున్నారన్నారు. అసలు పట్టణంలో ప్రజలు ఉన్నారన్న ఆలోచన వీరికి ఉందాని ప్రశ్నించారు. నాయకులు, అధికారుల దృష్టిలో ప్రజలంటే ఎలక్షన్లు వచ్చినప్పుడు ఓట్లు వేయడానికి, మునిసిపాలిటీ ఆర్థిక అవసరాల కోసం పన్నులు చెల్లించేటప్పుడు మాత్రమే ప్రజలను మనుషులుగా గుర్తిస్తున్నారని నాయుడుపేటలో జరుగుతున్న దురాగతాలు మరి ఎక్కడ కనిపించడం లేదని మండిపడ్డారు. అధికారుల సహకారంతో ఇసుక, మట్టి ఇలా ఏది పడితే అది అనుమతులు లేకుండా దోచుకుంటున్నారని నాయుడుపేట అంటే ఇప్పుడు దోపిడీకి చిరునామాగా మారిందని, పై అధికారులు స్పందించి నాయుడుపేట పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలించి చర్యలు చేపట్టకపోతే ప్రజల సహకారంతో ప్రభుత్వ కార్యాలయాలు ముట్టడి చేస్తామని హెచ్చరించారు.

క్రీడల్లో సత్తా చాటిన చెన్నూరు విద్యార్థులు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు మున్సిపల్ పరిధిలోని చెన్నూరు, బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు క్రీడల్లో రాణిస్తూ రాష్ట్రస్థాయిలో తమ సత్తా చాటుతున్నారు. అండర్ 14 విభాగంలో 8వ తరగతి విద్యార్థి మోహిత్, బీచ్ వాలీబాల్‌లో, 6 వ తరగతి విద్యార్థులు సుధీర్, చెంచయ్య, స్విమ్మింగ్‌లో రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు.10వ తరగతి విద్యార్థి చరణ్ అండర్ 19 విభాగంలో బాక్సింగ్లో ఎంపికైనాడు. అండర్ 17 కబడ్డీలో చరణ్ పదవ తరగతి మండలంలో ద్వితీయ స్థానం సాధించి, డివిజన్స్ స్థాయిలో పాల్గొన్నాడు. అండర్ 14 విభాగంలో మండల స్థాయికి వాలీబాల్ లో మోహిత్ ఎంపికయ్యాడుజ దినేష్ 9వ తరగతి, అండర్ 17 వాలీబాల్‌లో డివిజన్ స్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచాడు. డిఆర్‌డబ్ల్యు కళాశాలలో నిర్వహించిన చదరంగం పోటీల్లో చరణ్ తేజ 8వ తరగతి విజేతగా నిలిచాడు. విజేతలకు ఉపాధ్యాయులు అభినందించారు.

నియోజకవర్గ అభివృద్ధిపై సమాలోచన

ప్రజాశక్తి - పిచ్చాటూరు: సత్యవేడు నియోజకవర్గ అభివృద్ధిపై ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం శనివారం జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్లు ను కలిసి సమాలోచన చేశారు. సత్యవేడు నియోజకవర్గంలో పంచాయతీ భవనాలు నిర్మాణానికి నిధులు మంజూరు అయ్యాయన్నారు. ప్రతి పంచాయితీ భవనం నిర్మాణానికి 32 లక్షలు చొప్పున మొత్తం రూ.5.44 కోట్లు ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. ఎస్సీ జనాభా ఎక్కువ ఉన్న పంచాయతీలలో తాగునీరు, పైప్ లైన్, స్మశానానికి రోడ్డు, మురికి కాలువ వంటి మౌలిక సదుపాయాలు కల్పనకు రూ.20 లక్షలు చొప్పున నిధులు మంజూరు అయ్యాయన్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులను కలిసి పనులు పూర్తి చేయాలని కోరారు. జిల్లా కలెక్టర్, అధికారులు తన వినతులకు సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే వెల్లడించారు.

జిల్లా కలెక్టర్ ను కలిసిన డీఎఫ్ఓ సాయిబాబా

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి జిల్లా అటవీశాఖ అధికారిగా బాధ్యతలు చేపట్టిన ఐఎఫ్ఎస్ అధికారి సాయిబాబా శనివారం జిల్లా కలెక్టరేట్లో కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. శుక్రవారం జిల్లా అటవిశాఖ అధికారి కార్యాలయంలో సాయిబాబా బాధ్యతలను చేపట్టారు.

ఎస్జిఎఫ్ వెయిట్ లిఫ్టింగ్ రాష్ట్ర స్థాయి పోటీలకు మంగళం విద్యార్థులు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): వడమలపేట ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎస్జిఎఫ్ వెయిట్ లిఫ్టింగ్ అండర్ 17 అండ్ 19 నిర్వహించిన ఎంపిక పోటీలలో మంగళం ట్రెండ్స్ ఉన్నత పాఠశాల క్రీడాకారులు ప్రతిభ కనబరిచి ఎస్జిఎఫ్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు కేశవులు నాయుడు, వ్యాయామదర్శకులు సాంబశివరావు, సురేష్, రూపలత తెలియజేశారు. అండర్ 19 విభాగంలో జీవిత 9వ తరగతి, ప్రీతి 9వ తరగతి, శశి పాండు 10వ తరగతి, అభిషేక్ 9వ తరగతి, నవీను 9వ తరగతి అండర్ 17 విభాగంలో ప్రియా 9వ తరగతి, అభినయ 9వ తరగతి రాష్ట్రస్థాయికి ఎంపిక ఎంపికైయారన్నారు. వీరు 23వ తేదీ నుండి గుంటూరు జిల్లాలో నిర్వహించే రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీలలో పాల్గొంటారన్నారు.

దశల వారి పోరాటాలు చేస్తాం

ప్రజాశక్తి - తిరుపతి సిటీ:ఏపీఎస్పీడీసీఎల్ పరిధిలోని కాంట్రాక్ట్ విద్యుత్ కార్మికుల సమస్యలు పరిష్కరం అయ్యేంతవరకు దశల వారి పోరాటాలు చేపడతామని స్ట్రగుల్ కమిటీ నాయకులు, తిరుపతి జిల్లా కన్వీనర్ తుమ్మల కుమార్, కో కన్వీనర్ రవికుమార్ తెలిపారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ విద్యుత్ సంస్థలో ప్రధాన డిమాండ్లుగా కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ వర్కర్ల రెగ్యులరైజేషన్ సమస్యలు, పర్మినెంట్ ఉద్యోగుల సమస్యలు, పాత పెన్షన్ వర్తింపజేయాలని లేనిపక్షంలో సమ్మె చేస్తామని సోదర జేఏసీ సమ్మెకు పిలిపిచ్చిందన్నారు. ఇదే అంశాల మీద అప్పటికే జిల్లాలలో డిస్కంల వద్ద, గత నెలలో విద్యుత్ సౌదా వద్ద ధర్నా కూడా నిర్వహించినట్లు తెలిపారు. జేఏసీ కూడా ఇదే ప్రధాన డిమాండ్స్‌గా సమ్మెకు పిలిపివ్వడంతో స్ట్రగుల్ కమిటీగా మేము సిద్ధమయ్యామని, అవి నెరవేరకుండా మధ్యలో జేఏసీ విరమించుకోవడం శోచనీయమన్నారు. కాంట్రాక్ట్ కార్మికుల రెగ్యులరైజేషన్ సమస్యను తుంగలో తొక్కడం అన్యాయమని, కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ కార్మికులకు నేరుగా వేతనాలు చెల్లించడం వల్ల 200 కోట్ల రూపాయలు సంస్థకు మిగులుతోందని తెలిపారు. అనంతరం వివిధ డిమాండ్లను తెలిపారు. తిరుపతి ఎస్పీడీసీఎల్ కార్యాలయం వద్ద హమాలీలు 25 రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్న, అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తమన ప్రధాన డిమాండ్స్ నెరవేరేవరకు దశల వారి ఆందోళనలకు సిద్ధమవుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ నాయకులు మురళి, చిరంజీవి, ఆరోగ్య దాస్, శరత్ తదితరులు పాల్గొన్నారు.

దళారులను నమ్మి మోసపోకండి : టిటిడి ఛైర్మన్

ప్రజాశక్తి - తిరుమల: తిరుమల శ్రీవారి దర్శనం, ఆర్జిత సేవలు, వసతి కోసం దళారులను నమ్మి మోసపోవద్దని టిటిడి ఛైర్మన్ బీఆర్ నాయుడు శనివారం భక్తులకు విజ్ఞప్తి చేశారు. ఇటీవలి కాలంలో కొందరు దళారులు, మధ్యవర్తులు శ్రీవారి దర్శనం పేరుతో భక్తులను పలు మార్గాల ద్వారా మోసం చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. భక్తులను మోసం చేస్తున్న దళారులను టిటిడి గుర్తించి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. టిటిడి సేవలకు సంబంధించి https://ttdevasthanams.ap.gov.in, ttdevasthanams మొబైల్ యాప్ ద్వారా ఆన్ లైన్‌లో తమ ఆధార్ కార్డు ఆధారంగా బుక్ చేసుకోవాలని కోరారు.

ఎంజీఎంలో దీపావళి వేడుకలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి:స్థానిక ఎంజిఎం ఇంగ్లీష్ మీడియం స్కూల్లో శనివారం ముందస్తు దీపావళి పండుగ వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు సాంప్రదాయ దుస్తుల్లో వచ్చి, టపాసులు కాల్చి, నాటక ప్రదర్శనలతో అలరించారు. చెడుపై మనిషి సాధించిన విజయానికి ప్రతీకగా దీపావళిని వెలుగుల కాంతులతో జరుపుకుంటారని ఎంజీఎం సంస్థల డైరెక్టర్ గుడ్లూరు మయూర్ తెలిపారు. ప్రధానోపాధ్యాయులు మునిరత్నం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఎస్పీకి హోటల్ అసోసియేషన్ శుభాకాంక్షలు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్ :తిరుపతి జిల్లా నూతన ఎస్పీగా నియమితులైన సుబ్బరాయుడును శనివారం తిరుపతి హోటల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆయనను కలిసి దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కెవి చౌదరి మాట్లాడుతూ జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు గతంలో ఇక్కడ పనిచేసిన సందర్భంగా తిరుపతి భద్రతపై తీసుకున్న చర్యలను వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి హెూటల్స్ అసోసియేషన్ నేతలు చిల్లీస్ అంజి, రిగాలియా హోటల్ నితిన్ చక్రవర్తి, లోకేష్, కుమారస్వామి రెడ్డి, వంశీ కృష్ణ రెడ్డి, ఓరియన్ శ్రీనివాస్, గ్రీన్ మెరీడియన్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

బంజారాల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే నిర్ణయాలు వద్దు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): శ్రీవారి భక్తుడు శ్రీ స్వామి హథీరాం బాబాజీ మఠానికి సంబంధించిన భవనం బంజారాల ఆత్మగౌరవానికి ప్రతీక అని, భవనం కూల్చే నిర్ణయాన్ని తీసుకొని ఆత్మగౌరవాన్ని దెబ్బతీయొద్దని హథీరాం బావాజీ పరిరక్షణ సమితి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు, మాజీ ఎంపీ సీతారాం నాయక్ కోరారు. శనివారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్సీ లతో కలిసి సీతారాం నాయక్ మీడియాతో మాట్లాడారు. దేశవ్యాప్తంగా 12 కోట్ల మందికి పైగా బంజారా, లంబాడి, సుగాలి జాతులకు సంబంధించిన వారికి ఆరాధ్య దైవంగా శ్రీ స్వామి హథీరాం బావాజీ ఉన్నారన్నారు. మఠం ఆస్తుల పరిరక్షణకు కట్టుబడి వెంటనే బోర్డు ఏర్పాటు దిశగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కూటమి ప్రభుత్వం చర్యలకు ఉపక్రమించకపోతే దేశవ్యాప్తంగా ఉన్న బంజారాలను ఐక్యం చేస్తూ చలో తిరుపతి కార్యక్రమానికి శ్రీకారం చుడుతామని హెచ్చరించారు.

ఈవో అందుబాటులో ఉండాలి: శివానంద స్వామి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ప్రఖ్యాతిగాంచిన టిటిడిలో సామాన్య భక్తులు సమస్యలపై ఫిర్యాదులు, సలహాలు, సూచనలు ఇవ్వాలన్న ఈవో అందుబాటులో ఉండడం లేదని, అపాయింట్మెంట్ ఉంటే కానీ కలవనివ్వని పరిస్థితుల నుండి టీటీడీని తప్పించాలని శివ కామేశ్వరి శక్తిపీఠం తెలంగాణ ప్రాంత ధర్మచార్య శివానంద స్వామి డిమాండ్ చేశారు. శనివారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ సాధు పరిషత్ అధ్యక్షులుగా చెప్పబడి శ్రీనివాసనంద సరస్వతి స్వామి తిరుమల స్వామివారి విఐపి బ్రేక్ దర్శన టికెట్లను పొంది అక్రమ మార్గంలో విక్రయించడంపై తగు విచారణ జరిపించాలని కోరుతూ ఫిర్యాదు చేయాలని ఈవో కార్యాలయానికి వెళితే, అపాయింట్మెంట్ ఉంటే గానీ కలిసే అవకాశం లేదని చెప్పడం దారుణమన్నారు.

అభివృద్ధి పనుల జాబితా సిద్ధం చేయండి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్:నగరంలోని ప్రజలకు ఉపయోగకరమైన అభివృద్ధి పనులతో కూడిన జాబితాను సిద్ధం చేయాలని నగరపాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష అధికారులకు సూచించారు. జరగబోవు కౌన్సిల్ సమావేశంలో చర్చించనున్న మినిట్స్‌పై కమిషనర్ ఎన్.మౌర్య అధ్యక్షతన అన్ని విభాగాల అధికారులతో శనివారం సాయంత్రం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ప్రజల సమస్యలను పరిష్కరించేలా చూడాలని తెలిపారు. కమిషనర్ మౌర్య మాట్లాడుతూ కార్పొరేటర్లు ఇచ్చిన వినతులను, నగరంలో పర్యటించిన సమయంలో ప్రజలు తెలిపిన సమస్యలను, ప్రజా పిర్యాదుల పరిష్కార వేదికలో వచ్చిన వినతులను పరిష్కరించేలా జాబితా సిద్ధం చేశామని తెలిపారు. మార్పులు, చేర్పులు చేసి తుది జాబితా సిద్ధం చేయాలని మేయర్ తెలిపారు.

క్రైం న్యూస్

దొంగలు అరెస్ట్.. నగలు, మోటార్ సైకిళ్లు స్వాధీనం

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: ప్రయాణీకుల బ్యాగులను, మోటార్ సైకిళ్లను చోరీ చేస్తున్న దొంగలను అరెస్టు చేసి, వారి వద్ద నుండి సుమారు 230 గ్రాముల బంగారు నగలు, 4 మోటార్ సైకిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు తిరపతి ఏ.ఎస్.పిలు రవి మనోహర చారి, నాగభూషణంలు తెలిపారు. స్థానిక క్రైమ్ పోలీస్ స్టేషన్లో శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ ప్రయాణికులు వద్ద బ్యాగులు దొంగలించే జ్యోతి (32), నందిని (30), ప్రియా(26) తిరుపతి పోలీసులు అదుపులోకి తీసుకున్నారని, వీరిపై విశాఖపట్నం, మల్కాపురం, కోడూరు, అలిపిరి, తమిళనాడు ప్రాంతాలలో పాత కేసులు నమోదై ఉన్నాయని వెల్లడించారు. ప్రకాశం జిల్లాకు చెందిన కొండరాజు రత్తయ్య(29), తిరుపతి బండ్ల వీధికి చెందిన కందన్ సాయి(28) మోటార్ సైకిల్ దొంగిలించే వారిని వీరిపై తిరపతి పుత్తూరు గాజుల మండలం పాకాల కార్వేటినగరం కడప నెల్లూరు జిల్లాలలో పలు కేసులు నమోదయ్యాయని వెల్లడించారు. శనివారం తిరుపతి జయాశ్యామ్ రోడ్డులో ముగ్గురు మహిళా నిందితులను, నెహ్రూ హైస్కూల్ గ్రౌండ్ సమీపంలో రోడ్డులో మోటార్ సైకిల్ దొంగలను అదుపులో తీసుకొని వారి వద్ద నుంచి 25 లక్షలు విలువగల సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ కేసులో ప్రతిభ కనబరిచిన సిబ్బందికి రివార్డు అందచేయనున్నట్లు తెలిపారు.

లారీ ఢీ.. వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి - రేణిగుంట: రేణిగుంట మండలం, గాజుల మండలం పంచాయతీ పరిధిలోని సర్కిల్ వద్ద శనివారం ద్విచక్ర వాహనంపై వెళ్తున్న పసుపులేటి సురేష్‌ని వెనుక వైపు నుండి లారీ ఢీకొట్టింది. దీంతో సురేష్ కుడికాలుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు బుల్లెట్ పాలెం నుండి తిరుపతికి ద్విచక్ర వాహనం వెళ్తున్న పసుపులేటి సురేష్‌ను లారీ డ్రైవర్ అతివేగంగా నడిపి ఢీకొట్టినట్లు తెలిపారు. 108కి సమాచారం అందించి రుయా హాస్పిటల్‌కు తరలించినట్లు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

లక్ష్య సాధనకు పట్టుదల ముఖ్యం

ప్రజాశక్తి - తిరుపతి సిటీ, మంగళం: విద్యార్థులు శ్రద్ధగా అంకితభావంతో చదువుకుంటే భవిష్యత్తులో తాము అనుకున్నది సాధించవచ్చని చదలవాడ రమణమ్మ కళాశాల ట్రస్టీ మెంబర్ వరుణ్ సాయి పేర్కొన్నారు. స్థానిక రేణిగుంట రోడ్డులోని చదలవాడ రమణమ్మ ఇంజనీరింగ్ కళాశాలలో జెనెసిస్ 2కె25 పేరిట ఫ్రెషర్స్ డే వేడుకలు శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిలుగా కళాశాల ట్రస్టీ మెంబర్స్ చదలవాడ కవిత, కుమారి సాహితి, వరుణ్ సాయి, రంగనాథం, డైరెక్టర్ అండ్ ప్రిన్సిపాల్ డాక్టర్ భాస్కర్ పటేల్ పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ట్రస్టీ నెంబర్ వరుణ్ సాయి మాట్లాడుతూ విద్యార్థి దశ ఎంతో కీలకమని, విద్యార్థులు ప్రణాళికాబద్ధంగా చదవాలని, లక్ష్య సాధనతో విద్యార్థులు ఉన్నత శిఖరాలను అందుకోవాలన్నారు. కళాశాల డైరెక్టర్, ప్రిన్సిపాల్ భాస్కర్ పటేల్ మాట్లాడుతూ చదలవాడ రమణమ్మ ఇంజనీరింగ్ కళాశాలలో చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులకు నిష్ణాతులైన అధ్యాపకులు బోధన అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం కోఆర్డినేటర్ సంజీవ రాయుడు, ఉపాధ్యాయులు, విధ్యార్థులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించండి

ప్రజాశక్తి - నాయుడుపేట: నిబంధనలకు పాటించకుండా వాహనాలు నడుపుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని నాయుడుపేట అర్బన్ సీఐ ఎం.బాబి హెచ్చరించారు. నాయుడుపేటలో మద్యం సేవించి వాహనాలు నడిపిన 26 మంది పై కేసుల నమోదు చేసి, కోర్టుకు పంపామని తెలిపారు. సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి వారికి జరిమానాలు విధించినట్లు తెలిపారు. ఒక్కొక్కరికి పదివేల రూపాయల చొప్పున 26 మందికి రెండు లక్షల అరవై వేల రూపాయల జరిమానా విధించారన్నారు.

రాజశ్రీ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) కోర్టు : రైల్వేకోడూరు

O.S.No. 73/2025

తాళ్ళ నరసయ్య. ...వాది

Vs

వేంపల్లి వాసంతి, భర్త కార్తీక్, డోర్‌నెం.20-1-463, మారుతినగర్, కొర్లకుంట ఏరియా, చైతన్య స్కూల్ ఎదురుగా, తిరుపతి అర్బన్, శ్రీబాలాజి జిల్లా-517 101.
...ప్రతివాది

దావా సమను

పై కనిన వాది ప్రతివాది అయిన మీ పై ప్రోనోటు బాకీ వసూలు నిమిత్తం పై కనిన కోర్టు నందు దావా దాఖలు చేసియున్నారు. ఇందునకు మీకు ఏమైనా అభ్యంతరాలు ఉన్న ఎడల 27.10.2025వ తేదీ ఉదయం 10.30 గంటలకు పై తెలిపిన కోర్టు నందు మీరు స్వయముగా గాని లేదా న్యాయవాది ద్వారా గాని హాజరై తెలుపుకొనగలరు. లేనిచో మీ పరోక్షమున తీర్మానించబడునని తెలుపడమైనది.

//By Order of the Court//

యం. శంకరయ్య
న్యాయవాది, రైల్వేకోడూరు.

మహారాజశ్రీ కదిరి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

O.S.No.497/2022

Between:
షేక్ మహమ్మద్ మరియు ఇతరులు ...వాదులు
V/s
షేక్ ఇస్మాయిల్ మరియు ఇతరులు ...ప్రతివాదులు

8వ,13వ ప్రతివాదులకు దావా నోటీసు

D8: షేక్ మహబూబ్ బాషా S/o మోదీన్ సాబ్ డోర్.నెం: 29-176, కొత్తపేట, పుంగనూర్, చిత్తూరు జిల్లా.
D13: షేక్ అతీయా W/o మస్తాన్ సాబ్ డోర్.నెం: 16-823, సోసైటి కాలనీ, మదనపల్లి, అన్నమయ్య జిల్లా.

అను మీ పైన షేక్ మహమ్మద్ మరియు ఇతరులు దావా ఆస్తిలో తమకు రావలసిన వాటా బాగపరిష్కార నిమిత్తం. పై వారి కోర్టునందు దావా దాఖలు చేసియున్నారు. సదరు దావాలో మీ హాజరు నిమిత్తం పై వారి కోర్టునందు 31-12-2025వ తేదీన వాయిదా ఉన్నది. సదరు వాయిదా తేదీన మీరు స్వయంగా గాని, వకీలు ద్వారా గాని, పై వారి కోర్టునందు ఉదయం 10:30 గంటలకు హాజరై మీ అక్షేపణలు తెలుపుకొనవచ్చును. లేని యెడల పై దావా మీ పరోక్షమున తీర్మానం చేయబడును.

(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
వాయిదా తేది: 31/12/2025
స్థలం: కదిరి

V.PRASAD REDDY, B.A.B.L.,
K.GANGADHARA,B.Com.BL.,
వాదిపరం వకీలు, కదిరి, శ్రీ సత్యసాయి జిల్లా.

మహారాజశ్రీ ఘనమైన గూడూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

ఒ.యస్.నెం. **173/2024**

యాళ్ళపల్లి భానుప్రకాష్ ...వాది
ఎదిరి
బి.బాలాజీ, తండ్రి బాబు, వార్డు/డోర్ నెం. 14-321, పాంచాలి నగర్, రేణిగుంట, తిరుపతి జిల్లా.
...ప్రతివాది

పై నెంబరు దావాలోని వాది అయిన నా క్లయింటు యాళ్ళపల్లి భాను ప్రకాష్ ప్రతివాది అయిన మీపై పైన తెలిపిన కోర్టులో మీనుండి ప్రోనోటు బాకీ వసూలు పరిష్కారం నిమిత్తం దావా వేసియున్నందున సదరు దావాలో ఘనమైన కోర్టువారు మీకు నోటీసు జారీచేసి యున్నారు. సదరు విషయమై మీకు ఏమైనా ఆక్షేపణలున్నయెడల మీరు ప్రత్యక్షంగా గానీ లేదా లాయరు ద్వారాగాని పైన తెల్పిన కోర్టులో పై నెంబరు దావాలో తేది 04.11.2025 దినమున హాజరయి తెలుపుకొనవలసినది. అట్లుకాని యెడల మీ పరోక్షమున పై నెంబరు దావా తీర్మానించబడునని ఇందు మూలముగా తెలియజేయడమైనది.

ఇట్లు
ఎ.విజయభాస్కర్, B.Sc, B.L.,
వాది తరపున న్యాయవాది

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో,ఒంగోలు

IA No : 427/2025
IN
OS No : 39/2025

సిరిపురపు వెంకటసుబ్బయ్య ...వాది/పిటిషనర్
వర్సెస్
సి. హెచ్. అశోక్ రెడ్డి మరియు ఇతరులు
.... ప్రతివాదులు/రెస్పాండెంట్స్

To
R1) సి. హెచ్. అశోక్ రెడ్డి
S/o సి. హెచ్. నాగిరెడ్డి
నివాసం : డోర్ నెంబర్ 1-8-122/B,
SBI కాలనీ, అన్నమయ్య సర్కిల్,
AIR బైపాస్ రోడ్డు, తిరుపతి నగరం,తిరుపతి జిల్లా.

పైనెంబర్ గల పిటిషన్‌లో వాది/పిటీషనర్ ఎన్నిసార్లు మీకు కోర్టు ద్వారా నోటీసులు పంపినప్పటికీ మీరు తీసుకోకుండా కాలయాపన చేయుచున్నందున పై కోర్టు వారు పత్రికా ప్రకటన ద్వారా తెలియజేయవలసిందిగా ఆదేశించివున్నారు. కావున మీరు తేది : 07-11-2025న ఉదయం 10:30 కి శ్రీ కోర్టు వారిఎదుట స్వయంగా గాని లేదా మీ తరపున వకీలు ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలియ పరచుకొనగలరు లేనియెడల మీ పరోక్షమున తీర్మానించబడునని తెలియజేయడమైనది

// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //
వాయిదా తేది : 07-11-2025

ఇట్లు
కోలా శివప్రసాద్
సిరిపురపు శ్రీనివాసరెడ్డి
అడ్వకేట్స్
ఒంగోలు, ప్రకాశం జిల్లా

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో, ఒంగోలు

IA No :429/2025
IN
OS No : 39/2025

సిరిపురపు వెంకటసుబ్బయ్య ...వాది/పిటిషనర్
వర్సెస్
సి. హెచ్.అశోక్ రెడ్డి మరియు ఇతరులు
....ప్రతివాదులు/రెస్పాండెంట్స్

To
R1) సి. హెచ్. అశోక్ రెడ్డి
S/o సి. హెచ్. నాగిరెడ్డి
నివాసం :డోర్ నెంబర్ 1-8-122/B,
SBI కాలనీ, అన్నమయ్య సర్కిల్,
AIR బైపాస్ రోడ్డు, తిరుపతి నగరం,తిరుపతి జిల్లా.

పై నెంబర్ గల పిటిషన్‌లోవాది /పిటీషనర్ ఎన్నిసార్లు మీకు కోర్టు ద్వారా నోటీసులు పంపినప్పటికీ మీరు తీసుకోకుండా కాలయాపన చేయుచున్నందున పై కోర్టు వారు పత్రికా ప్రకటన ద్వారా తెలియజేయవలసిందిగా ఆదేశించివున్నారు. కావున మీరు తేది:07-11-2025న ఉదయం 10:30 కి శ్రీ కోర్టు వారిఎదుట స్వయంగా గాని లేదా మీ తరపున వకీలు ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలియపరచుకొనగలరు లేనియెడల మీ పరోక్షమున తీర్మానించబడునని తెలియజేయడమైనది

// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //
వాయిదా తేది : 07-11-2025

ఇట్లు
కోలా శివప్రసాద్
సిరిపురపు శ్రీనివాసరెడ్డి
అడ్వకేట్స్
ఒంగోలు, ప్రకాశం జిల్లా

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో ఒంగోలు

IA No : 428/2025
IN
OS No : 39/2025

సిరిపురపు వెంకటసుబ్బయ్య ...వాది/పిటిషనర్
వర్సెస్
సి. హెచ్. అశోక్ రెడ్డి మరియు ఇతరులు
.... ప్రతివాదులు/రెస్పాండెంట్స్

To
R1) సి. హెచ్. అశోక్ రెడ్డి
S/o సి. హెచ్. నాగిరెడ్డి
నివాసం : డోర్ నెంబర్ 1-8-122/B,
SBI కాలనీ, అన్నమయ్య సర్కిల్,
AIR బైపాస్ రోడ్డు, తిరుపతి నగరం,తిరుపతి జిల్లా.

పైనెంబర్ గల పిటిషన్‌లోవాది /పిటీషనర్ ఎన్నిసార్లు మీకు కోర్టు ద్వారా నోటీసులు పంపినప్పటికీ మీరు తీసుకోకుండా కాలయాపన చేయుచున్నందున పై కోర్టు వారు పత్రికా ప్రకటన ద్వారా తెలియజేయవలసిందిగా ఆదేశించివున్నారు. కావున మీరు తేది :07-11-2025న ఉదయం 10:30 కి శ్రీ కోర్టు వారిఎదుట స్వయంగా గాని లేదా మీ తరపున వకీలు ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలియ పరచుకొనగలరు లేనియెడల మీ పరోక్షమున తీర్మానించబడునని తెలియజేయడమైనది

// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //
వాయిదా తేది : 07-11-2025

ఇట్లు
కోలా శివప్రసాద్
సిరిపురపు శ్రీనివాసరెడ్డి
అడ్వకేట్స్
ఒంగోలు, ప్రకాశం జిల్లా

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో,ఒంగోలు

OS No : 39/2025

సిరిపురపు వెంకటసుబ్బయ్య ...వాది
వర్సెస్
సి. హెచ్. అశోక్ రెడ్డి మరియు ఇతరులు
.... ప్రతివాదులు

To
D1) సిహెచ్.అశోక్ రెడ్డి
S/o సిహెచ్. నాగిరెడ్డి
నివాసం :డోర్ నెంబర్ 1-8-122/B, SBI కాలనీ,
అన్నమయ్య సర్కిల్, AIR బైపాస్ రోడ్డు,
తిరుపతి నగరం, తిరుపతి జిల్లా.

పైనెంబర్ గల దావాలో వాది ఎన్నిసార్లు మీకు కోర్టు ద్వారా సమన్లు పంపినప్పటికీ మీరు తీసుకోకుండా కాలయాపన చేయుచున్నందున పై కోర్టు వారు పత్రికా ప్రకటన ద్వారా తెలియజేయవలసిందిగా ఆదేశించివున్నారు. కావున మీరు తేది 07-11-2025న ఉదయం 10:30కి శ్రీకోర్టు వారిఎదుట స్వయంగా గాని లేదా మీ తరపున వకీలు ద్వారా గాని హాజరై మీ ఆక్షేపణలు తెలియపరచు కొనగలరు లేనియెడల మీ పరోక్షమునతీర్మానించబడునని తెలియజేయడమైనది

// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //
వాయిదా తేది : 07-11-2025

ఇట్లు
కోలా శివప్రసాద్
సిరిపురపు శ్రీనివాసరెడ్డి
అడ్వకేట్స్
ఒంగోలు, ప్రకాశం జిల్లా

దావూద్ తండ్రి మృతికి పరామర్శ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : స్థానిక మున్సిపాలిటీ, 13వ వార్డు, ఎన్టీఆర్ కాలనీ చెందిన ముస్లిం మైనారిటీ వైఎస్ఆర్సిపి యువ నాయకుడు దావూద్ తండ్రి మొహమ్మద్ అలీ ఇటీవల మృతి చెందారు. సమాచారం అందుకున్న మాజీ మంత్రి ఆర్.కె. రోజా శనివారం ఆయన నివాసానికి వెళ్లి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు.

చేతులు శుభ్రం చేసుకోవడం మంచి అలవాటు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : చేతులు శుభ్రం చేసుకోవడం మంచి అలవాటని టాటా ట్రస్ట్, విజయ వాహిని చారిటబుల్ ఫౌండేషన్ అసోసియేషన్, సంతోష్ పేర్కొన్నారు. అంతర్జాతీయ చేతుల పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా టాటా ట్రస్ట్ విజయవాహిని చారిటబుల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం తడుకు ఆర్ఎస్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కో-లోకెటెడ్ అంగన్వాడీ కేంద్రంలో విద్యార్థులకు చేతుల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, ఐసిడిఎస్ సూపర్వైజర్, అంగన్వాడీ కార్యకర్తలు, పిల్లలు, తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో సహ చట్ట కమిషనర్

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి శనివారం సమాచార హక్కు చట్టం కమిషనర్ చావాలి సునీల్ కుటుంబ సమేతంగా విచ్చేశారు. వీరికి ఆలయాధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. అనంతరం గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద వేద పండితులు ఆశీర్వచనాలు పలకగా, ఏఈఓ మోహన్ ముక్కంటి తీర్థప్రసాదాలు జ్ఞాపికలు అందజేశారు.

జనసేన మండల ఉపాధ్యక్షుడు కృష్ణ మృతి

ప్రజాశక్తి - బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని ఎన్టీఆర్ నగర్ పంచాయతీకి చెందిన మండలం జనసేన పార్టీ మండల ఉపాధ్యక్షుడు కృష్ణ శనివారం మృతి చెందారు. నాలుగు రోజుల క్రితం బాత్రూంలో కాలు జారీ పడడంతో తలకు తీవ్ర గాయాల పాలైన ఆయనను తిరుపతి రుయాకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం ఆయన మృతి చెందారు. ఆయన మృతిపట్ల పలువురు జనసేన నాయకులు నివాళి అర్పించారు.

తహశీల్దార్‌పై చర్యలు తీసుకోండి : సిపిఐ

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: మండల కేంద్రంలో తహశీల్దారు అవినీతికి అడ్డు ఆపు లేకుండాపోతోందని సిపిఐ నాయకులు ఆరోపించారు. ఒకరికి చెందిన భూమిని మరొకరికి మార్చడంలో పెద్దల హస్తం ఎంతవరకు ఉందో, ఉన్నతాధికారులు నిగ్గు తేల్చాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. డీకేటి భూములు కొంతమందికి వారసత్వంగా వస్తున్నప్పటికీ, డీకేటి సెటిల్మెంట్ భూమి హక్కుదారు పేరు మీద మార్చమంటే నిబంధనలు చెబుతారని ఆరోపించారు. కానీ లంచాలు ఇస్తే మేత పోరంబోకు, చుక్కల భూములు, డికెటి భూములను ఆన్‌లైన్‌లోకి ఎక్కించేస్తున్నారని మండిపడ్డారు. ఉన్నతాధికారులు తహశీల్దారు నిర్వాకంపై విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో తహశీల్దార్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

బాలసదనంలో యువతరం ఫౌండేషన్ సేవలు

ప్రజాశక్తి - వెంకటగిరి టౌన్: తిరుపతి జిల్లా, వెంకటగిరి, బాలసదనంలో యువతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో అనాధ పిల్లలకు, చైర్మన్ కుటుంబ సభ్యులు విద్యా సామాగ్రి, ఫ్యాన్లు అందజేశారు. ఈ సందర్భంగా చైర్మన్ చంద్రగిరి శ్రీనివాసులు మీడియాతో మాట్లాడుతూ ట్రస్ట్ స్థాపనకు కారకులైన బొర్ర మెంబర్లు ఈగ హరికృష్ణ, ఏడుకొండలు, అనిల్, అశోక్, పవన్‌లకు ధన్యవాదాలు తెలియజేశారు.

ఉపాధి కూలీలు ఈకేవైసీ చేయించుకోవాలి

ప్రజాశక్తి - బాలాయపల్లి : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో పనిచేసే కూలీలందరూ కచ్చితంగా ఈ కేవైసీ చేయించుకోవాలని ఎంపీడీవో నారాయణ తెలిపారు. కూలీల జాబ్ కార్డులకు ఆధార్‌ని అనుసంధానం చేయడం జరుగుతుందన్నారు. మండల పరిధిలో జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరు టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్ దగ్గర ఈ కేవైసీ చేయించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏ పీ ఓ జ్యోతి, ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు, పాల ఉత్పత్తిదారులకు సంగం డెయిరీ ఆశాకిరణం

ప్రజాశక్తి - నాయుడుపేట: రైతులకు పాల ఉత్పత్తిదారులకు సంగం డైరీ ఆశాకిరణం అని పొన్నారు ఎమ్మెల్యే, సంగం డైరీ చైర్మన్ దూళిపాళ్ల నరేంద్ర పేర్కొన్నారు. శనివారం ఆయన నాయుడుపేట మండలం, మేనకూరు పారిశ్రామిక వాడలో నిర్మిస్తున్న సంగం డైరీ ప్రాజెక్టును పరిశీలించారు. అనంతరం నాయుడుపేట పట్టణంలోని మాజీ ఎంపీ సూళ్లూరుపేట నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి నెలవల సుబ్రహ్మణ్యం నివాసానికి చేరుకొని, సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యంలను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. అనంతరం సంగం డైరీ ప్రాజెక్టుకు సంబంధించిన అంశాలను చర్చించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే దూళిపాళ్ల నరేంద్రకు ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, నాయుడుపేట మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ రఫీ, శ్రీ పోలేరమ్మ ఆలయ కమిటీ చైర్మన్ నానబాల సుబ్బారావు, పలువురు నాయకులు శాలువాలు కప్పి, పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు తిరుమూరు సుధాకర్ రెడ్డి, వేలూరు మురళీకృష్ణ రెడ్డి,సంచి కృష్ణయ్య,అశోక్ రెడ్డి,కరీంబాయి చెంచయ్య,అవధానం సుధీర్,కె.గోపాలకృష్ణ,చిట్టేటి చెంచయ్య,ఇల్లి ముత్యాలయ్య,గోను బాబు, చంద్రశేఖర్,పలువురు నాయకులు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: బుచ్చినాయుడుకండ్రిగ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య అధికారి డిఎన్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఆరోగ్య సిబ్బంది, ప్రజలు శనివారం స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు.

బుచ్చినాయుడు కండ్రిగ పంచాయతీ కార్యదర్శి పెంచలయ్య ఆధ్వర్యంలో మండలంలోని వారాంతపు సంతలో శనివారం స్వచ్ఛ భారత్ స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు.

ప్రజాశక్తి - వాకాడు: శనివారం వాకాడు మండల ప్రజా పరిషత్ కార్యాలయం నుండి మండల కేంద్రంలోని అశోక స్తంభం వరకు వాకాడు మండల ఎంపీడీవో సాయి ప్రసాద్ అధ్యక్షతన స్వచ్ఛ్ ఆంధ్ర - స్వర్ణాంధ్ర ర్యాలీ నిర్వహించారు.

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పుత్తూరు, ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్వర్ణాంధ్ర.. స్వచ్ఛాంధ్రపై శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రమౌళి మాట్లాడుతూ గాలి కాలుష్యం తగ్గించడంతో, పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందన్నారు.

ప్రజాశక్తి - నాయుడుపేట: స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర లక్ష్యం నెరవేరేందుకు అందరూ కృషి చేయాలని నాయుడుపేట మున్సిపల్ కమిషనర్ షేక్ ఫజలుల్లా, ఎంపీడీఓ కె.సురేష్ బాబులు సూచించారు. వారి ఆధ్వర్యంలో శనివారం నాయుడుపేటలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏఎల్‌సిఎం హైస్కూల్ ఆవరణలో మొక్కలు నాటారు.

ప్రజాశక్తి - చిట్టమూరు: స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం చిట్టమూరు మండల తహశీల్దార్ నరేష్, ఎంపీడీవో ఉమామహేశ్వరరావుల ఆధ్వర్యంలో మండల కార్యాలయాల పరిసరాలను సిబ్బందితో కలిసి శుభ్రం చేశారు. అనంతరం మొక్కలు నాటారు.

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: ప్రతి ఒక్కరూ తాము నాలుగు మొక్కలు నాటి, మరో నలుగురితో మరికొన్ని మొక్కలు నాటించడం ద్వారా పర్యావరణాన్ని కాపాడుకోవచ్చునని ఈఎస్ ఐ ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్యాంబాబు పేర్కొన్నారు. స్థానిక ఆర్టీసి రోడ్‌లోని ఈఎస్ఐ ఆసుపత్రిలో శనివారం" స్వచ్ఛ ఆంధ్ర -స్వర్ణ ఆంధ్ర "లో భాగంగా ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఆసుపత్రి ఆర్ఎంఒ డాక్టర్ ఏవిఎస్. ప్రసాద్, స్పెషలిస్ట్ డాక్టర్ లు యు.వెంకయ్య, సి.హెచ్. సునీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి - బాలాయపల్లి : పరిశుభ్ర రాష్ట్రంగా తీర్చిదిద్ది దేశంలోనే అగ్రగామిగా నిలపాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని ఎంపీడీఓ నారాయణ అన్నారు. శనివారం. 'స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛదివస్' కార్యక్రమం పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం లో పరిసరాల పరిశుభ్రత, వాయు కాలుష్యం గురించి అవగాహన కార్యక్రమం, స్వచ్ఛ భారత్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో టి.రామకృష్ణ, ఎస్ఐ గోపి, ఏపీఎం కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

తిరుమలలో సన్నిధి శరభయ్య యాదవ్ విగ్రహం ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుమలలో సన్నిధి శరభయ్య యాదవ్ విగ్రహావిష్కరణ చేసి శరభయ్య మఠం (యాదవ సత్రం) ఏర్పాటు చేయాలని యాదవ హక్కుల పోరాట సమితి జాతీయ కార్యదర్శి పూల వెంకటాద్రి యాదవ్ విజ్ఞప్తి చేశారు. శనివారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పురాణాలలో శరభయ్య విశిష్టతను పరిగణలోకి తీసుకొని టిటిడి ఆ దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విలేకరుల సమావేశంలో కృష్ణ యాదవ్, హేమాద్రి యాదవ్, చిట్టిబాబు యాదవ్, మాసుమయ్య, సతీష్ పాల్గొన్నారు.

ఘనంగా శ్రీ స్వామి హాథీరాం బావాజీ బర్త్ వేడుకలు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుమల శ్రీవారికి పరమ భక్తుడిగా పేరుగాంచిన శ్రీ స్వామి హాథీరాం బావాజీ 497వ బర్త్ కార్యక్రమాన్ని తిరుపతి గాంధీ రోడ్డులోని శ్రీ స్వామి హాథీరాంజీ మఠంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన భోగ్ బండారా కార్యక్రమానికి దేశవ్యాప్తంగా 14 రాష్ట్రాల నుండి వివిధ మఠాధిపతులు, ఆలిండియా బంజారా సంఘాల నాయకులు, మఠం పరిరక్షణ సమితి నాయకులు పెద్ద ఎత్తున హాజరై ఈ కార్యక్రమాన్ని నిర్వహించి, తిరుమలకు శోభాయాత్రగా తరలి వెళ్లారు. ఈ కార్యక్రమంలో శ్రీ హథీరాం బావాజీ మహాసంఘ్ అధ్యక్షులు అమ్మునాయక్, కార్యక్రమం అధ్యక్షులు కృష్ణ నాయక్, ప్రసాద్, రమేష్ నాయక్ పెద్ద సంఖ్యలో సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ప్రజా పోరాటాలే అజెండా

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: రెడ్ బుక్ ఆగడాలను దాటి ప్రజా పోరాటాలే అజెండాగా వైసిపి శ్రేణులు ముందుకు సాగాలని తిరుపతి పార్లమెంటు సభ్యులు మద్దిల గురుమూర్తి, ఎమ్మెల్సీ డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం, మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి పిలుపునిచ్చారు. స్థానిక సరస్వతి ఆడిటోరియంలో శనివారం నియోజకవర్గ వైసిపి విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ముఖ్య అతిధులుగా వీరు హాజరయ్యారు. కూటమి ప్రభుత్వ అరాచకాలు, ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజాక్షేత్రంలో ఎండగట్టేందుకు ప్రతి వైసీపీ కార్యకర్త నడుం కట్టాలని సూచించారు. కార్యకర్తలపై వేధింపులు, అక్రమ కేసులు, అరెస్టులపై డిజిటల్ బుక్ లో ఫిర్యాదు చేయాలని కోరారు. ముందుగా గ్రామ, వార్డు, మండల కమిటీల నియామకాలను తగరతిగ చేపట్టి ప్రజా క్షేత్రంలో కూటమిపై యుద్ధం చేసేందుకు కార్యకర్తలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. వైసీపీ స్టేట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ వజ్ర భాస్కర్ రెడ్డి, ట్రస్ట్ బోర్డు మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, వైసీపీ రాష్ట్ర కార్యదర్శి ఓడూరు గిరిధర్ రెడ్డి, ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి ఉన్నం వాసుదేవ నాయుడు, చెవిరెడ్డి మధుసూదన్ రెడ్డి, సిరాజ్ బాషా, వయ్యాల కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించండి

ప్రజాశక్తి - కోట : కోట మండల టపాసుల దుకాణాదారులు నిబం ధనల ప్రకారం అమ్మకాలు జరపాలని తహశీల్దార్ కటారి జయ జయ రావు సూచించారు. శనివారం కోట, విద్యానగర్, వెంకన్న పాలెం గ్రామాలకు చెందిన 17 టపాసుల దుకాణాదారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పలు భద్రతా చర్యలను సూచించారు. ఈ కార్యక్రమంలో ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసులు, ఫైర్ సిబ్బంది, ఎస్సై పవన్ కుమార్, డిప్యూటీ తాహసిల్దార్ మల్లికార్జునరావు, పాల్గొన్నారు.

ఏర్పేడు రోడ్ ఓవర్ బ్రిడ్జ్ త్వరగా పూర్తి చేయాలి :ఎంపి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: ఏర్పేడు-వెంకటగిరి జాతీయ రహదారి 565 పై ఏర్పేడు వద్ద నిర్మాణంలో ఉన్న రోడ్ ఓవర్ బ్రిడ్జ్ పనులను శనివారం తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి పరిశీలించారు. ఏర్పేడు ఎల్.సి 36 రైల్వే క్రాసింగ్ కారణంగా ఆ రహదారిపై తరచూ ట్రాఫిక్ స్తంభించి రాకపోకలకు ఇబ్బందిగా మారిందని గుర్తించి రోడ్ ఓవర్ బ్రిడ్జ్ నిర్మాణానికి ప్రతిపాదనలు చేసినట్లు ఆయన తెలిపారు. 2023 లో రూ. 98.76 కోట్లతో రోడ్ ఓవర్ బ్రిడ్జ్ నిర్మాణం మొదలైనా పనులు ఇంకా నత్తనడకన సాగుతుండటంతో ఎంపీ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ మార్గం ద్వారా ప్రతిరోజూ ఐఐటి, ఐజర్ వంటి ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థలకు వెళ్లే విద్యార్థులు, వెంకటగిరి, రాపూరు వెళ్లే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.

జీఎస్టీపై ప్రజల్లో ఉత్సాహం

ప్రజాశక్తి - వెంకటగిరి టౌన్: జీఎస్టీ 2.0 ప్రజానీకానికి ఊరట అందించిందని స్థానిక ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ పేర్కొన్నారు. శనివారం దక్కిలిలో నిర్వహించిన అవగాహన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. కమ్మపల్లి రోడ్ సెంటర్ వద్ద వ్యాపారులు, వినియోగదారులతో మాట్లాడి, కొత్త జీఎస్టీ విధానంతో కలిగే లాభాలను వివరించారు. ఈ కార్యక్రమం లో మండల అధ్యక్షులు, పిఎసిఎస్ చైర్మన్లు, క్లస్టర్ ఇంచార్జీ లు, మండల కమిటీ నాయకులు, కూటమి పాల్గొన్నారు.

బిఎస్ఎన్ఎల్ దీపావళి ఆఫర్లు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: బిఎస్ఎన్ఎల్ దీపావళి సందర్భంగా అపరిమిత కాల్స్, నెట్ వినియోగం, ఎస్ఎంఎస్‌లపై ఇస్తున్న ఆఫర్లను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తిరుపతి బిఎస్ఎన్ఎల్ జిల్లా డివిజనల్ మేనేజర్ వెంకోబ్రావు శనివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో కోరారు. ఆయన మాట్లాడుతూ బియస్ఎన్ఎల్ సేవలు దీపావళి సందర్భంగా అతి తక్కువ ధరకు లభిస్తున్నట్లు తెలిపారు. వివరాలకు బియస్ఎన్ కార్యాలయాన్ని సంద్రించాలన్నారు.

యువతరంగ్‌లో యువత సందడి

ప్రజాశక్తి - క్యాంపస్ : యస్వీయులో యువతరంగ్ - 2025 కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. ఇందులో భాగంగా మూడవ రోజయిన శనివారం శ్రీనివాస ఆడిటోరియం, అన్నమయ్య భవనం, సెనేట్ హాల్ వంటి కేంద్రాల్లో సాంస్కృతిక పోటీలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన కళాకారులు తమ అత్యద్భుత ప్రదర్శనలతో అద్భుతం ఆహూతులను ఆకట్టుకున్నారు.

నకిలీ మరకలు అంటగట్టే కుట్ర

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : జగన్ అండ్ కో చేసిన నకిలీ మద్యం మరకలను కూటమికి అంటగట్టే కుట్రను రాష్ట్రంలో వైసీపీ చేస్తోందని టిడిపి బీసీ విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ ఎం.ఉమేష్ రావు శనివారం విమర్శించారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని అన్ని విధాలా నాశనం చేసి నేడు సన్నాయి నొక్కులు నొక్కడం జగన్ కే సాధ్యపడిందని ఎద్దేవా చేశారు. జగన్ హయాంలో పారిశ్రామిక పతనం ప్రారంభం కాగా, బాబు హయాంలో పరిశ్రమలు పరుగులు పెడుతున్నాయన్నారు. దశరథ ఆచారి, మిన్నల్ రవి, భాస్కర్, కోట చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.